ఈ దుర్వాసన ఇంకెన్నాళ్లు..?

- పాఠశాల పక్కనే డంపింగ్ యార్డు
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- డంపింగ్ యార్డు తొలగించాలని స్థానికుల డిమాండ్


మక్తమహబూబ్‌పేట్‌లోని పాఠశాల పక్కన బురదమయంగా మారిన దృశ్యం

మియాపూర్: మక్తమహబూబ్‌పేట్‌లో ప్రభుత్వ పాఠశాల సమీపంలో డంపింగ్ యార్డు ఉండడంతో స్కూల్ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాల వెనక భాగంలో 100,101 సర్వే నెంబర్‌లోని ఖాళీ స్థలంలో జీహెచ్‌ఎంసీ డంపింగ్ యార్డు ఉంది. ఇక్కడికి నియోజకవర్గంలోని కాలనీ, బస్తీలలో చెత్తను ఆటోలు, లారీలలో ఇక్కడికి తరలిస్తారు. ఇక్కడ నుంచి జవహర్‌నగర్‌లో ఉన్న డంపింగ్ యార్డుకు తరలిస్తారు. ఇలా చెత్తను తరలించడంలో అలసత్వం వహించడం, ఎప్పటికప్పుడు చెత్తను తరలించకపోవడంతో మక్తమహబూబ్‌పేట్ సమీపంలో ఉన్న యార్డులో చెత్త పేరుకుపోయింది. ఓ వైపు దీప్తీ శ్రీనగర్ ధర్మపురి ఆలయం రోడ్డు వరకు, మరో వైపు మక్తమహబూబ్‌పేట్ పాఠశాల సమీపం వరకు చెత్త గుట్టలు పేరుకుపోతోంది. వర్షాకాలంలో వర్షాలు పడి చెత్త అంతా కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. పాఠశాల ముందు, పక్క నుంచి వందలాది చెత్త వాహనాలు డంపింగ్ యార్డుకు వెళ్తుంటాయి.

వర్షాకాలంలో మరీ దారుణం..

- వర్షాకాలంలో బురద, ఎండాకాలంలో దుమ్ము, ధూళితో పాటు దుర్వాసన భరించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- ఒక్కొక్కసారి డంపింగ్ యార్డు నుంచి పాఠశాల ఆవరణ వరకు ఆటోలు నిలిచిపోవడంతో వాటి నుంచి వచ్చే దుర్వాసనతో పిల్లలు కొన్ని సందర్భాల్లో వాంతులు, వీరేచనాలు చేసుకుంటున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వాపోతున్నారు.
- ఈగలు, దోమలు ఎక్కువగా ఉండడంతో అనారోగ్య పాలవుతున్నారని పిల్లలను తల్లిదండ్రులు సరిగా స్కూల్‌కు పంపించేందుకు ఇష్టపడడం లేదు.
- ముఖ్యంగా చిన్న పిల్లల పరిస్థితి మరింత దారుణంగా ఉందని, వర్షాకాలంలో వర్షాలు పడుతుండడం వల్ల సమస్య మరింత తీవ్రంగా ఉందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


పాఠశాల ముందు నుంచే వెళ్తున్న వాహనాలు

అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి..

దీప్తీశ్రీనగర్, మక్తమహబూబ్‌పేట్ మధ్య ఉన్న ఖాళీ స్థలంలో జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డుతో స్థానికులకు అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. దుర్వాసన వెదజల్లుతోందని, ఇక్కడ నుంచి డంపింగ్ యార్డును తొలగించాలని, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు పలుమార్లు ఆందోళన కార్యక్రమాలు చేసినా స్పందన లేదు. ఈ యార్డును ఇక్కడ నుంచి తొలగించి దూరంగా ఏర్పాటు చేస్తే కాలనీవాసులకు ఎంతో మేలు జరుగుతుంది.

–నరేష్, దీప్తీశ్రీనగర్

ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయాలి..

మక్తమబూబ్‌పేట్‌లోని పాఠశాల పక్క నుంచి వందలాది చెత్త వాహనాలు డంపింగ్ యార్డుకు వెళ్తుంటాయి. వర్షాకాలంలో ఆ ప్రాంతమంతా బురదమయంగా మారి దుర్వాసన వెదజల్లుతోంది. ప్రస్తుతం భారీ వాహనాలు వెళ్తుండడంతో ఆ ప్రాంతమంతా దుమ్ము, ధూళితో నిండిపోతోంది. చెత్తను డంపింగ్ యార్డు లోపలికి తీసుకెళ్లకుండా కొందరు ఆటో డ్రైవర్లు స్కూల్ సమీపంలోని చెత్త వేసి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో వర్షాలు పడి చెత్త అంతా కుళ్లిపోయి తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయాలి.

–శ్రీకాంత్,మక్తమహబూబ్‌పేట్

సమస్యల పరిష్కారానికి కృషి


కాలనీవాసులతో కాంగ్రెస్ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్

మియాపూర్: శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని కాలనీ, బస్తీలలో సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. మియాపూర్‌లోని బీకే ఎన్‌క్లేవ్, ప్రజా షెల్టర్, రెడ్డికాలనీ, సాయినగర్, సుభాష్‌నగర్ బస్తీలలో ఆయన పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీ, బస్తీల్లో ఎలాంటి సమస్యలున్నా.. తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తానన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు అందేలా చూస్తానన్నారు. కాంగ్రెస్ నాయకులు వీరేందర్‌గౌడ్, సాంబశివరావు, నాగేశ్వర్‌రావు, జీవీరెడ్డి, కృష్ణ, సత్తిరెడ్డి, పాపిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులున్నారు.

హాకీ క్రీడకు పూర్వ వైభవం తీసుకొస్తా !



ఆర్థికసాయం అందజేస్తున్న కొండ విజయ్‌కుమార్

హఫీజ్‌పేట్ : జాతీయ క్రీడ అయిన హాకీకి రాష్ట్రంలో పూర్వ వైభవం తీసుకొస్తామని తెలంగాణ హాకీ నూతన అధ్యక్షుడు కొండ విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం హాకీ క్రీడపట్ల మక్కువ చూపిస్తున్న ఇద్దరు క్రీడాకారులు అరుణ్, తరుణ్‌లకు హాకీ క్రీడ సామగ్రి కోసం రూ.20 వేలను ఆయన తన కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హాకీక్రీడను ప్రోత్సహించేలా ప్రతి గ్రామంలోని పాఠశాలల్లో హాకీ క్రీడ ప్రాముఖ్యతను వివరిస్తామన్నారు. తన పదవీకాలంలో తెలంగాణలో నేషనల్‌తో పాటు సౌత్‌జోన్ టోర్నమెంట్ నిర్వహిస్తామని ప్రకటించారు. హాకీ ప్రతినిధులు, శిక్షకుడు తారాసింగ్ తదితరులున్నారు.

‘మనూ’లో పరిశోధక విద్యార్థినికి పీహెచ్‌డీ


షమీమాపర్వీన్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో పరిశోధక విద్యార్థినికి పీహెచ్‌డీ డిగ్రీని ప్రదానం చేస్తున్నట్లు ఆదివారం తెలిపారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలోని విద్యా విభాగంలో షమీమాపర్వీన్ పరిశోధక విద్యార్థినికి పీహెచ్‌డీని ప్రకటించారు. ‘మనూ’ కాలేజ్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్(సీటీఈ) సందర్భంగా, సహ పర్యవేక్షణలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మొజాఫర్ ఇస్లామ్ పర్యవేక్షణలో సీటీఈ బీదర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బొండురాజు సహ పర్యవేక్షణలో ఆమె పీహెచ్‌డీని పూర్తి చేశారు. దీని కోసం ‘అండర్ స్టాండింగ్ ఆఫ్ ది జియోగ్రాఫికల్ కాన్సెప్ట్స్ అమోంగ్ ది రిలేషన్ టు కాగ్నిటివ్ ఎబిలిటీస్’ అనే అంశంపై పీహెచ్‌డీ థీసిస్‌ను సమర్పించారు. దీంతో పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు.

కేంద్ర మాజీమంత్రి మల్లికార్జున్‌కు నివాళి


నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేత జగదీశ్వర్‌గౌడ్, తదితరులు

శేరిలింగంపల్లి: కేంద్ర మాజీమంత్రి డాక్టర్ మల్లికార్జున్‌కు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆదివారం నల్లగండ్లలోని ఆయన సమాధి వద్ద కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జ్ జగదీశ్వర్‌గౌడ్ నాయకత్వంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు, స్థానికులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మల్లికార్జున్ వర్ధంతిని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ.. కేంద్రమంత్రి, పీసీసీ అధ్యక్షుడిగా మల్లికార్జున్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చేసిన సేవలను కొనియాడారు. పలువురు కాంగ్రెస్‌పార్టీ నాయకులు, శ్రీకృష్ణ యూత్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

- ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ హనుమాన్‌నగర్‌కి చెందిన అరుణ అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకుంది. ఈ మేరకు మంజూరైన లక్ష రూపాయల చెక్కును ఆదివారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఎల్లంనాయుడు, బాలు తదితరులు పాల్గొన్నారు.

మెకానికల్ ఇంజనీరింగ్ వర్క్ షాప్

పటాన్‌చెరు టౌన్: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ‘రేపటి ఆవిష్కర్తలను రూపొందించడం, మెకానికల్ ఇంజనీరింగ్, రోబోటిక్స్, కృత్రిమ మేథ అంశాల’పై రెండురోజుల వర్క్‌షాప్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత మార్కెట్, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా పాఠ్యాంశాలు, మెకానికల్ ఇంజనీరింగ్ నైపుణ్యం–ఆధారిత విద్యను రూపొందించడం లక్ష్యంగా వర్క్‌షాపు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గీతం కోర్ ఇంజనీరింగ్ డీన్ ప్రొఫెసర్ రామశాస్త్రి, సూరత్ ఎన్ఐటీ ప్రొఫెసర్ మురుగేంద్రప్ప, ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్, వరంగల్ ఎన్ఐటీ ప్రొఫెసర్ వి.వాసు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలో గల హుడా పరిధిలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను ఆదివారం అధికారులు కూల్చివేశారు. హుడా పరిధిలోని భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే సహించేది లేదని హుడా ఎస్ఐ సంతోష్ హెచ్చరించారు.

శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్ల ప్రదానం

నిజాంపేట్: ప్రగతినగర్ సుందరయ్య భవనంలోని ప్రగతి టెక్ అకాడమీ ఆధ్వర్యంలో వెబ్ డిజైనింగ్, జావా, ట్యాలీ, కంప్యూటర్ బేసిక్స్, ఎమ్మెస్ ఆఫీస్, మల్టీమీడియా, ఫొటోషాప్ కోర్సులలో శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్ల ప్రదానం జరిగింది. ఈ సందర్భంగా అకాడమీ నిర్వాహకులు మల్లేష్, సుబ్బారావు మాట్లాడుతూ... ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని అన్నారు. దీనిని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జనవరిలో మరో బ్యాచ్‌ను ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రహీం, మురళీకృష్ణ, సుందరయ్య భవనం నిర్వహణ కమిటీ కన్వీనర్ చారి తదితరులు పాల్గొన్నారు.

సాంప్రదాయాలను కాపాడేందుకే రంగోళి పోటీలు


విజేతలకు బహుమతులను అందిస్తున్న ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్

శేరిలింగంపల్లి: మన సంస్కృతి, సాంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు అందించేందుకే రంగోళి పోటీలను నిర్వహిస్తున్నామని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ రామస్వామియాదవ్ పేర్కొన్నారు. ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్, కొమిరిశెట్టి ఫౌండేషన్ సంయుక్తాధ్వర్యంలో ముత్యాల ముగ్గుల పోటీలను బాపునగర్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు ఆయన అసోసియేషన్ ప్రతినిధులతో అందించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతి ఏటా సంక్రాంతి పర్వదినానికి రంగోళి పోటీలను మహిళలకు 30 కాలనీల్లో నిర్వహించి వారిలో విజేతలకు బహుమతులను అందిస్తామన్నారు. మహిళల్లో ఉన్న సృజనాత్మకశక్తిని వెలికి తీయడానికి ఈ పోటీలను కొనసాగిస్తున్నామన్నారు. న్యాయ నిర్ణేతగా భూదేవి వ్యవహరించారు. అనంతరం విజేతలను ఎంపిక చేసి వారికి బహుమతులను అందించారు. అసోసియేషన్ సభ్యులు మంగళంపల్లి వెంకటరాధ, శ్రీరామచంద్రమూర్తి, కుమారి, ఆర్గనైజర్ తన్వీర్‌బేగం, 70 మంది మహిళలు పాల్గొన్నారు.

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం


ఎమ్మెల్యే గాంధీని సత్కరిస్తున్న గుల్‌మోహర్‌కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

శేరిలింగంపల్లి: మూడోసారి విశ్వాసంతో గెలిపించిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ స్పష్టం చేశారు. గచ్చిబౌలి డివిజన్‌లోని గుల్‌మోహర్ పార్కు కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో గత రెండు టర్మ్‌లలో శేరిలింగంపల్లిలో గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.9వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కళ్లకు కనిపించేలా చేసిన అభివృద్ధితో శేరిలింగంపల్లి రూపురేఖలే మారిపోయాయని అభిప్రాయపడ్డారు. గత ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి ప్రణాళికలు ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తే ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని ఆయన స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవ చేయడానికి ముందుంటామన్నారు. మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టిసాయిబాబా, కాలనీ అధ్యక్షుడు షేక్ ఖాసీమ్, కార్యదర్శి ఆనంద్‌కుమార్, మోహన్‌రావు, రఘురామ్, ప్రభాకర్‌చారి, కిషోర్‌బాబు, విక్టోరియారాణి వెంకటేశ్వర్లు, సమీర్ పటేల్, షేక్‌రాజా, పద్మ, లక్ష్మి, అరుణ, నివేదిత, నాయకులు రామస్వామియాదవ్, మోహన్‌గౌడ్, గణేష్‌ముదిరాజ్, రాజుయాదవ్, సత్యనారాయణ, శ్రీనివాసరాజు, రవీందర్‌గౌడ్, రాంచందర్ యాదవ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు


కాంగ్రెస్‌లో చేరిన వారితో శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ జగదీశ్వర్‌గౌడ్

శేరిలింగంపల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజల్లో సంతోషాలు వెల్లివిరుస్తున్నాయని ఆ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జ్ జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. వివేకానందనగర్, చందానగర్ డివిజన్లకు చెందిన బీఆర్‌ఎస్‌పార్టీ నాయకులు భారీగా కాంగ్రెస్‌లో చేరారు. నల్లగండ్లలోని ఆయన నివాసంలో పార్టీలో చేరిన వారికి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలందరికీ దరిచేరేలా చేసే బాధ్యత ప్రతి కార్యకర్త, నాయకుడిపై ఉంటుందన్నారు.

- శేరిలింగంపల్లి అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంతో పాటు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు కొనసాగుతాయన్నారు.
- సంక్షేమ పథకాలైన ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మిపథకం, రైతుభరోసా, గృహలక్ష్మి, యువవికాసం, వృద్ధులకు, దివ్యాంగులకు చేయూత వంటి ఆరు గ్యారంటీ పథకాలు ప్రతి ఒక్కరికీ అందించేలా చేస్తామన్నారు.
- కాంగ్రెస్‌పార్టీ అన్ని వర్గాల వారికి న్యాయం చేసేలా చేస్తుందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. వివేకానందనగర్ నాయకులు నాగమణి యాదగిరి నాయకత్వంలో లక్ష్మి, సంజీవ్, యూసుఫ్, దొంతికార్తీక్‌గౌడ్, అనిల్, మౌలాలి, గోపి, రాజు, రాములు, రమేష్, చందానగర్ నాయకులు వెంకటేష్ ఆధ్వర్యంలో పలువురు చేరారు.

కార్మిక సమస్యలపై వినతి

పటాన్‌చెరు టౌన్: కార్మికుల సంక్షేమం, భద్రతకు కాంగ్రెస్ ప్రభుత్వం తప్పనిసరిగా దోహద పడుతుందని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య కార్యదర్శి శేషాద్రిని హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో కలిసి భవన నిర్మాణ, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక మంది కార్మికులు భద్రతా లోపంతో మృత్యువాత పడుతున్నారని వాపోయారు. భవన నిర్మాణరంగం, పరిశ్రమలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై వినతిపత్రం ఇచ్చామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయ్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు ‘కల్వారి టెంపుల్’ ముస్తాబు

- ప్రత్యేక ఆకర్షణగా 100 అడుగుల క్రిస్మస్ ట్రీ
- క్రిస్మస్ రోజున 4 ఆరాధన మహోత్సవాలు


హఫీజ్‌పేట్ : మియాపూర్‌లోని కల్వారి టెంపుల్ క్రిస్మస్ వేడుకలకు ముస్తాబు చేశారు. క్రిస్మస్‌కు కల్వారి టెంపుల్ వివిధ రకాల విద్యుత్‌దీపాల అలంకరణతో పాటు 100 అడుగుల క్రిస్మస్ ట్రీ ఆకర్షణీయంగా మారింది. పండుగ ఒక్కరోజు మాత్రమే లక్షలాది మంది ప్రార్థనల కోసం కల్వారి టెంపుల్‌కు వస్తారని, వారికి అనుగుణంగా ప్రత్యేక స్టాల్స్, కనీస వసతులను ఏర్పాటు చేయిస్తున్నామని కల్వారి టెంపుల్ వ్యవస్థాపకులు డాక్టర్ సతీష్ తెలిపారు. సందర్శకులకు భోజనం, వైద్యసేవలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి ఏటా కల్వారి టెంపుల్ ఆవరణలో 100 అడుగుల క్రిస్మస్ ట్రీని ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా వివరించారు.


విద్యుత్‌కాంతులతో కల్వారి టెంపుల్

ఆసియాలోనే అతిపెద్ద క్రిస్మస్ ట్రీ..

కల్వారిటెంపుల్ క్రిస్మస్ ట్రీ ఆసియాలోనే అతిపెద్దదని, ప్రార్థనలకు వచ్చే భక్తుల కోసం క్రీస్తు జన్మనాటక ప్రదర్శన నిర్వహిస్తున్నామని చెప్పారు.

- పండుగ రోజు రెండు లక్షలమంది ప్రార్థన కోసం భక్తులు వస్తారని వారికోసం మూడుహాల్స్‌లో నాలుగు ఆరాధన కార్యక్రమాలు ఉంటాయన్నారు.
- ప్రార్థనల అనంతరం భక్తుల కోసం 15 స్టాల్స్‌ను కూడా సిద్ధం చేశామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మియాపూర్ పోలీస్ సిబ్బందితో పాటు సుమారు 2వేల మంది వాలంటీర్లు, 100 మంది సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. వాహనాల కోసం ప్రత్యేక స్థలాన్ని సిద్ధం చేసినట్లు కల్వారి టెంపుల్ ప్రతినిధులు స్పష్టం చేశారు.



మియాపూర్ కల్వారి టెంపుల్‌లో 100 అడుగుల క్రిస్మస్ ట్రీ

రేపు దత్తజయంతి వేడుకలు

రాయదుర్గం: టెలికామ్‌నగర్‌లోని సాయిదత్తగణపతి ఆలయంలో 26న దత్తజయంతి వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు రవీందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఉదయం 6.30 గంటలకు ఆలయంలో షిర్డీసాయిబాబాకు కాకడ హారతితో వేడుకలను ప్రారంభిస్తామన్నారు. అనంతరం 7.30 నుంచి 9 గంటల వరకు షిర్డీసాయిబాబా, వినాయకుడు, దత్తాత్రేయస్వామికి పంచామృతాభిషేకం ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు సాయిసుచరిత్రపారాయణం, 12 గంటలకు మధ్యాహ్న హారతి, అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం వివరించారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు పురవీధుల్లో పల్లకి ఉత్సవం, 6.15 గంటలకు షిర్డీసాయిబాబాకు సంధ్యాహారతి, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు ప్రత్యేకంగా భక్తులతో ప్రత్యేక భజన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. రాత్రి 9 గంటలకు షేజ్ హారతితో వేడుకలను ముగించడం జరుగుతుందని, ఈ వేడుకలను ఆలయ అర్చకులు వీవీవీఎస్‌శర్మ పర్యవేక్షిస్తారు.

పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పనిచేయాలి

- కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండి రమేష్

కూకట్‌పల్లి: నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్‌కు నాయకులు, కార్యకర్తల నుంచి ఆదరణ పెరుగుతోంది. బాలానగర్‌కు చెందిన మాజీ పీసీసీ కార్యదర్శి సింగజోగి కృష్ణ, కూకట్‌పల్లి మాజీ ఇన్‌చార్జి శేరి సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నాయకులు బండి రమేష్ కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన నాయకత్వాన్ని బలపరుస్తూ ఘనంగా సత్కరించారు.

- ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రతి నాయకుడు, కార్యకర్త శక్తివంచన లేకుండా పని చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాలు ప్రజలకు చేరేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కొప్పుశెట్టి దినేష్, గంట శ్రీనివాస్‌గౌడ్, రమేష్, రాజేష్‌గౌడ్, స్వరూప, దేవి, రాజేశ్వరి, రాణి నిర్మల, కిరణ్, యోగి, ప్రణవ్, గిరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్యార్వీ షరీఫ్ ఉత్సవం

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండలో జరిగిన గ్యార్వీ షరీఫ్ ఉత్సవ కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మత సామరస్యానికి ప్రతీక గ్యార్వీ షరీఫ్ ఉత్సవమని అన్నారు. అందరూ సామరస్యంగా నిర్వహించుకునే వేడుక, ఎంతో పవిత్రంగా కొలిచే గ్యార్వీ షరీఫ్ ఉత్సవాన్ని భక్తి శ్రద్ధలతో శాంతియుతంగా జరుపుకోవాలని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని ముస్లింలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నాయినేని చంద్రకాంత్ రావు, కాశీనాథ్‌యాదవ్, ఎల్లం నాయుడు, ఎంఏ. సమద్, ఎంఏ. కరీం, ఎండీ గౌస్, ఖాజా, చాంద్, గౌసుద్దీన్, బడే ఖాజా, మున్నా తదితరులు పాల్గొన్నారు.

తారకరామ్ నగర్‌లో..

ఎల్లమ్మబండ పరిధిలోని తారకరామ్ నగర్‌లో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు సమద్ ఆధ్వర్యంలో ఆదివారం గ్యార్వీ షరీఫ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై అన్నదానం చేశారు.

